# గుట్టలో వైభవంగా తిరు కల్యాణోత్సవం



లక్ష్మీనరసింహుల తిరు కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 30 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుల నిత్య తిరు కల్యాణోత్సవం శనివారం శాస్త్రోక్తంగా జరిపించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిర్వహించిన అర్చకులు ఉత్సవమూర్తులను ద్వివ మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవ నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచే పు చేసి కల్యాణతంతు జరిపించారు. సుమారు గంటన్నరకు పైగా నిర్వహించిన తిరు కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీక్షించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామిని మేల్కొల్పి తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామి వారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన

చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం వేళలో స్వామి వారికి తిరువీధి, దర్బార్ సేవ ఘనంగా నిర్వహించారు. రాత్రివేళలో స్వామి వారి తిరువారాధన చేపట్టి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేశారు. పాతగుట్టలో స్వామి వారికి నిత్యారాధనలు ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున అర్చకులు వేదమంత్రాలు పటిస్తూ అమ్మవార్లకు తిరుప్పావై పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ధనుర్మాస విశిష్టతను భక్తులకు వివరించారు. గోదాదేవి శ్రీరంగ నాయకుడిపై రచించిన పాశురాలను పఠిస్తూ అర్చకులు మార్గళి పూజలు చేశారు. అనుబంధ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సంకష్టహర చతుర్ది వ్రతం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలు కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ.30,95,017 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి తెలిపారు.

### జనవరి ఒకటిన ప్రత్యేక ఏర్పాట్లు

న్యూఇయర్ సందర్భంగా సోమవారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో సకల ఏర్పాట్లు చేయనున్నట్లు ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు. ప్రధానాలయంతో పాటు పాతగుట్ట ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది వాటిల్లకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. స్వామి వారి కొండపైన, పాతగుట్ట ఆలయాల క్యూ లైన్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచనున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా కొండపైకి, కిందికి వెళ్లేందుకు ప్రత్యేక ఉచిత ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

# భక్తులకు మౌలిక వసతులు మెరుగుపరుస్తాం

- దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్



క్యూలైన్‌ను పరిశీలిస్తున్న దేవాదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్

యాదగిరిగుట్ట, డిసెంబర్ 30 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకునే భక్తులకు ఇబ్బంది లేకుండా సకల ఏర్పాట్లు చేపడుతామని దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చక బృందం ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికింది. దర్శన అనంతరం అర్చకులు వేదాశీర్వచనం చేయగా ఆలయ ఈఓ రామకృష్ణారావు స్వామి వారి ప్రసాదం అందించారు. అనంతరం ఆలయ ప్రాంగణాలను కలియతిరిగి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానాలయం వద్ద క్యూలైన్లు, లడ్డూ ప్రసాద విభాగం, ఉత్తరవైపు వైపు భక్తులకు దర్శనం కోసం వేసి ఉండేందుకు గదులు, శౌచాలాయాలు, తాగునీరు, వైద్య సదుపాయాలను కల్పించనున్నట్లు తెలిపారు. క్యూ కాంప్లెక్స్‌లో వెంటిలేటర్ల పునరుద్ధరణ, ఏసీ బిగింపుతో పాటు క్యూలైన్ల ప్రాంతంలో భక్తులు కూర్చునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. త్వరలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆలయాన్ని పర్యటించే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ, ఏఈఓ శ్రవణ్‌కుమార్, ఈఈ దయాకర్‌రెడ్డి, ఆలయ అధికారులు రాజన్‌బాబు, దూశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

# ప్రజలకు సత్వర న్యాయం కోసమే లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు




లోక్ అదాలత్‌తో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 30 : న్యాయ సేవాధికార సంస్థ చట్టం ద్వారా ప్రజలకు ఉచిత న్యాయం, న్యాయ విజ్ఞానం అందించడంతో పాటు చిన్న తగాదాలను లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు ఎ.జయరాజు అన్నారు. భువనగిరి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌ను ప్రారంభించి మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్ జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల ఆవరణలో నిర్వహించబడుతుందన్నారు. ప్రజలకు ఉచిత న్యాయం, న్యాయ విజ్ఞానం, స్నేహ పూర్వక వాతావరణంలో ఉండటమే గాక, సివిల్ కేసులను పరిష్కరించుకుని తమ కుటుంబ శ్రేయ స్సు, ఆర్థిక ప్రగతికి తోడ్పడుతుందన్నారు. జాతీ య లోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా 5,523 క్రిమినల్ కేసులు, 18 సివిల్ కేసులు, ప్రిలిటిగేషన్ కేసులు, టెలిఫోన్ రుణ బకాయల కేసులు 30, ఎస్‌బీఐ 4 కేసులను పరిష్కరించి మొత్తం రూ.5,74,000 మొత్తంగా చెల్లించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.మారుతీదేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, భువనగిరి ఏసీపీ వెంకట్‌రెడ్డి, భువనగిరి న్యాయవాదుల సంఘం కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, పీపీలు శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, స్వామి, పద్మజ, ప్రభుత్వ న్యాయవాదులు బి.కేశవరెడ్డి, బాబూరావు, న్యాయ సహాయ న్యాయవాదులు ఎస్.జయపాల్, జి.శంకర్ పాల్గొన్నారు.

# పాలడుగువాసికి జాతీయ పురస్కారం



పార్థసారధిశర్మకు జాతీయ మహానంది పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు

మోత్కూరు, డిసెంబర్ 30 : మండలంలోని పాలడుగుకు చెందిన రాంబట్ల పార్థసారధిశర్మ జాతీయ మహానంది పురస్కారం అందుకున్నారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన తెలుగు సంస్కృతీ, సాహితీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారం అందించారు. పార్థసారధిశర్మ యాదగిరిగుట్టలోని సంస్కృత విద్యా పీఠంలో నాలుగేండ్ల పాటు పౌరోహిత్యంలో తర్ఫీదు పొందారు. తెలుగు సంస్కృత పౌరోహిత రంగంలో నిర్వహించిన పోటీల్లో ఆయన ప్రతిభ కనబర్చినట్లు తల్లిదండ్రులు గుంటోజు శేఖర్, జానకి తెలిపారు. కార్యక్రమ ముఖ్య అతిథి వారణాసి నాగేశ్వరాచారి, ప్రముఖ రచయిత్రి సురేపల్లి విజయ, సంస్థ సలహాదారు మానేపల్లి నరసింహాచార్యుల నుంచి పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. పార్థసారధిశర్మ ప్రస్తుతం హైదరాబాద్‌లోని మలక్‌పేటలో పౌరోహిత్యం చేస్తున్నట్లు తెలిపారు. పార్థసారధిశర్మకు పురస్కారం రావడంపై గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

### పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల దరఖాస్తుకు గడువు పొడిగింపు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 30 : 2023-24 విద్యా సంవత్సరానికిగాను జిల్లాలోని వివిధ ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్న అర్హులైన ఎస్సీ విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తుకు జనవరి 31వరకు గడువు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి ఎం.జయపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఉపకార వేతనాలకు ఆన్‌లైన్ ఈ-పాస్ వెబ్‌సైట్ http:// telanganaepass. cgg.gov.in నందు దరకాస్తు చేసుకోవాలని కోరారు.



పోచంపల్లి మీ సేవ సెంటర్ వద్ద బారులు తీరిన ప్రజలు

# ఆధార్ అవస్థలు

- అప్డేట్‌కు బారులు తీరిన ప్రజలు
- ఆందోళనతో ఉరుకులు పరుగులు
- ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 30 : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 5గ్యారంటీల అమలులో భాగంగా ఈ నెల 28నుంచి దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటించింది. దరఖాస్తులకు ఆధార్, రేషన్‌కార్డు తప్పనిసరి అని చెప్పడంతో ప్రజలు ఆ పనిలో నిమగ్నమయ్యారు. దీంతో పట్టణంలోని మీ సేవ కేంద్రాలు, ఆధార్ కేంద్రాల వద్ద ఉదయం 7గంటల నుంచి సాయంత్రం మూసివేసే వరకు అక్కడే పడిగాపులు కాస్తున్నారు. అసలు పథకాలకు ఎవరు అర్హులు, దరఖాస్తుకు ఏం ఉండాలనేది ఎవరూ చెప్పకపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఈ దరఖాస్తులు జనవరి 6వరకు నిర్వహించే సభల్లో అందించాలని చెప్పడంతో సొంత పనులు విడిచి ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఆధార్ కార్డులో పేరు తప్పులు ఉన్నా, అడ్రస్ సరిగా లేకున్నా వాటిని సరి చేసుకునేందుకు కేంద్రాలకు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

### ఆధార్ కేంద్రాల్లో టోకెన్ సిస్టమ్

భువనగిరి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, యూనియన్ బ్యాంకు( ఆంధ్రా బ్యాంకు), ఏపీజీవీబీ, ఎస్‌బీఐ బ్యాంకులతో పాటు రెండు ఆధార్ కేంద్రాల్లో ఆధార్ అప్‌డేట్, పేర్లు సంబంధిత వాటిని మార్చుతున్నారు. ఇందుకోసం ప్రతిరోజూ ఉదయం నుంచి కేంద్రం ముగిసే వరకు క్యూలైన్లలో ప్రజలు బారులు తీరుతున్నారు. దీంతో నిర్వాహకులు రోజుకు 30 నుంచి 50వరకే టోకెన్లు ఇచ్చి సేవలు అందిస్తున్నారు. దీంతో టోకెన్ల కోసం ఉదయం 6గంటలకే ప్రజలు కేంద్రాల వద్దకు చేరుకుని క్యూలైన్లలో నిల్చుంటున్నారు. ఈ క్రమంలో ఆధార్‌లో అప్‌డేట్ చేయడం కోసం సంబంధిత ఒరిజినల్ పత్రాలు లేకపోవడంతో రెసిడెన్షియల్ పత్రాన్ని అడుగుతున్నారు. ఇందుకోసం మరల రెసిడెన్షియల్ కావాలంటే తాసీల్దార్ కార్యాలయం ద్వారా తీసుకోవాలి. దీంతో తాసీల్దార్ కార్యాలయంలో ప్రజలు బారులు తీరుతున్నారు. కొందరికి దరఖాస్తులో ఏ పత్రాలు ఇవ్వాలో తెలవక ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాల కోసం తాసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

### పేరు మార్పిడికి మూడు రోజులు తిరిగా



ఆధార్‌లో మా కుటుంబ సభ్యుల పేర్ల మార్పిడికి మూడు రోజులు ఆధార్ కేంద్రాల చుట్టూ ఒక్క రోజు 10 గంటలకు, రెండోరోజు 8గంటలు, మూడో రోజు 6గంటలకు వస్తే పేరు మార్పిడి కోసం టోకన్ ఇచ్చారు. గ్యారంటీ పథకాలు పొందుడేమో గానీ వ్యవసాయం పనులు వదిలి కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుంది. దరఖాస్తులకు అవసరమైనవి చెబితే ఇంత ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదు. పథకాలేమో గాని పరేషన్ పడడం తప్పట్లేదు.

– కుచ్చుల బాలకృష్ణ, హన్మాపురం, భువనగిరి

### ఆధార్ నంబర్ ఉంటే చాలు

ప్రజా పాలనలో చేసుకునే దరఖాస్తులకు ఆధార్ నంబర్ మాత్రమే సరిపోతుంది. ఎలాంటి ఆధార్ అప్‌డేట్, ఈకేవైసీ అవసరం లేదు. ఎవరైనా ప్రజాపాలన దరఖాస్తు పత్రాలను జిరాక్స్ సెంటర్లు, మీ సేవ సెంటర్లలో అమ్మినట్లయితే కఠిన చర్యలు తప్పవు. ప్రజాపాలన దరఖాస్తు పత్రాలు పంచాయతీ సెక్రటరీ, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు అందిస్తారు. ప్రజాపాలన దరఖాస్తులకు జత చేయడానికి ప్రజలు ఆధార్ అప్డేషన్, ఈకేవైసీ కోసం మీసేవ సెంటర్లకు వెళ్లి ఇబ్బందులకు గురికావద్దు.

– జీ.వీరారెడ్డి, అదనపు కలెక్టర్